క్లుప్తంగా

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మం అర్బన్: నగరంలోని వివిధ దేవాలయాల్లో శనివారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఇందిరానగర్‌లోని శ్రీ బాలగణపతి ఆలయంలో అర్చకుడు గిరిధర్ ఆధ్వర్యాన పూజలు కొనసాగగా.. మధురానగర్‌లోని సాయి మందిరం, సాయిబాబా ఆలయాల్లో ఆలయ ఈఓ వీవీ నరసింహారావు, అధ్యక్షుడు బాజిన్ని వీరయ్య, కార్యదర్శి తిరుపతిరావు నేతృత్వాన దాత పసుమర్తి వెంకటేశ్వర్లు దంపతులు భక్తులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పనుల పరిశీలన

కూసుమంచి: మండలంలోని నేలపట్ల గ్రామంలోని పెద్ద చెరువుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వ తవ్వకం పనులు కొనసాగుతుండగా.. శనివారం తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. పనులను వేగంగా చేపట్టి రైతులకు సాగునీటిని అందించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిలకబత్తిన రామారావు, సంగీపు వీరభద్రం, దోమల రామనాథం తదితరులు పాల్గొన్నారు.

చెరువు నాలాలో చెత్త తొలగింపు



చెత్త తీయిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపల్ పరిధిలో గతేడాది వచ్చిన వరదల కారణంగా చెరువు నాలాలో పేరుకుపోయిన చెత్త నిల్వలను శనివారం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తొలగింపజేశారు. చెరువు అలుగు ద్వారా నాలా నిండి ఈప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో ప్రభుత్వం చేపట్టిన వందరోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా దాని నివారణకు ముందస్తుగా నాలాలో పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించినట్లు కమిషనర్ చెప్పారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన బైక్

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పంట కాల్వలోకి తీసుకెళ్లగా ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన సురేష్ శనివారం నేలకొండపల్లి నుంచి బైక్‌పై ముజ్జుగూడెం వెళ్తున్నాడు. ఈక్రమాన మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లగా గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఆయనను చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ పరిశీలించారు. లబ్ధిదారులను కలిసి పనులపై ఆరా తీశాక.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతున్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ సిప్ చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్‌లు వంగూరి వెంకటేశ్వర్లు, లిక్కి వీరబాబు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న యాదాల వెంకటేశ్వర్లు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంత్రి పొంగులేటి చొరవతో మంజూరైన చెక్కును శనివారం కాంగ్రెస్ మండల నాయకుడు ప్రతాపనేని రఘు లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య, గాంధీ, లక్ష్మయ్య, కృష్ణ, మురళీకృష్ణ, వెంకన్న, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	భైరవం
సాయిరాం	తొలిప్రేమ
ఆదిత్య	డ్రాగన్
శ్రీనివాస	థగ్‌లైఫ్

- ఖమ్మంగాంధీచౌక్

పేరుకే ప్రకృతి వనాలు..

బోర్డులకే పరిమితమైన కేంద్రాలు

- కనీస సౌకర్యాలు కరువు
- నగరంలో చాలా వరకు నిరుపయోగంగానే..
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



నందినినగర్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వన కేంద్రం

ఖమ్మం రాపర్తినగర్: నగరంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వన కేంద్రాలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని పట్టణ ప్రకృతి వన కేంద్రాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నా.. మరికొన్ని నామమాత్రంగా దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయాలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా..

గత ప్రభుత్వం హయాంలో నగరంలోని ప్రతీ డివిజన్ కేంద్రంలో కనీసం ఒక ప్రకృతి వనమైనా ఉండాలని భావించి ఏర్పాటు చేసింది. అయితే వీటిలో ఏమేమి ఉండాలనే నిబంధనలను మున్సిపల్ శాఖ జారీ చేయకపోవడంతో ఆయా డివిజన్లలోని కేంద్రాలు నామమాత్రంగా దర్శనమిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన ఖమ్మం కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టింపు కరువు..

నగరంలోని కొన్ని కేంద్రాల్లో నిత్యం వ్యాయామం చేసే పరికరాలు ఉండగా.. మరికొన్నింటిని గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. కనీస సౌకర్యాలు లేకుండా ఎందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు అని ఆయా డివిజన్ ప్రాంతాల ప్రజలు అధికారులను నిలదీస్తున్నట్లు తెలిసింది. ఇందుకు నిదర్శనం రాపర్తినగర్‌లోని నందినినగర్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వన కేంద్రమేనని ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ కనీసం వ్యాయామం చేసే పరిస్థితి కూడా లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా నగరంలో నిర్లక్ష్యానికి గురైన కేంద్రాలను గుర్తించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సైదులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ 8వ డివిజన్‌లోని బాలపేటలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బల్లేపల్లి సమీపంలోని అలుగు వాగు నుంచి బాలపేట, బాలపేటతండా నుంచి రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు వరకు పనులు సాగుతుండగా.. అడ్డుగా ఉన్న పలు భవనాలను, విద్యుత్ స్తంభాలను తొలిగింపు పనులు చేపడుతున్నారు. పాత విద్యుత్ లైన్లను తొలగించి కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో నిధులు మంజూరు చేయగాపనులు ప్రారంభమవగా.. పనులను కార్పొరేటర్ లకావత్ సైదులు శనివారం పర్యవేక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ.. కార్యకర్తలకు సైద్ధాంతిక స్థాయి పెంచి చైతన్య పరిచేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందున పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. పార్టీ మండల కమిటీ నాయకుడు దాసరి మహేందర్, పుసులూరి వీరభద్రం, దాసరి భద్రయ్య, వెంకటేష్, లింగయ్య, అంజి, విజయపాల్ రెడ్డి, పోట్ల వాసయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి బంగారుపతకం



సాయిదీపిక

ఖమ్మంఅర్బన్: కాకతీయ యూనివర్సిటీ బీ ఫార్మసీ ఫలితాల్లో ఖమ్మం విద్యార్థిని డి.సాయి దీపిక గోల్డ్ మెడల్ సాధించింది. ఖమ్మంలోని ఖమ్మం కాలేజీ ఆఫ్ ఫార్మసీకి చెందిన ఆమె యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలువగా వచ్చే నెల 7న జరిగే కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో మెడల్ అందుకోనుందని కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ పోట్ల ఏసయ్య చౌదరి తెలిపారు. ఈమేరకు శనివారం కాలేజీలో కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ బి.సాంబశివరావు, చంద్రశేఖరన్, హెచ్‌ఓడీ చంద్ర తదితదరులు విద్యార్థినిని అభినందించారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలని, పదోన్నతులు చేపట్టాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, సమ్మెకాలపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కార్యకలాపాల నివేదికను, కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. కోశాధికారి వల్లంకొండ రాంబాబు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశం నివేదికలను, కర్తవ్యాలను, తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా కార్యదర్శిగా పి.ప్రశాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షేక్.రంజాన్, అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీవీ.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, రాందాస్, నరసయ్య, నాగేశ్వరరావు, వీవీ.రామారావు, నిర్మలా కుమారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పర్యటించి పలు కుటుంబాలకు పరామర్శించారు. ఈనేపథ్యాన మంగాపురంతండాలో ఇటీవల మృతి చెందిన భూక్యా సాలమ్మ కుటుంబాన్ని, అజయ్‌తండాలో గుండెపోటుతో మృతిచెందిన ఐకేపీ సీసీ తేజావత్ శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, మరికంటి రేణుబాబు, షేక్ హుస్సేన్, కమదన ప్రవీణ్, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మదన్‌లాల్‌కు నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని జెడ్పీసెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సంస్మరణ సభను ఎల్‌హెచ్‌పీఎస్ నేత భద్రూ నాయక్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ సభలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎస్‌బీఐటీ విద్యా సంస్థల అధినేత ఆర్‌జేసీ కృష్ణ, మదన్‌లాల్ సోదరుడు బానోత్ సుందర్‌లాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం తదితరులు పాల్గొని మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరన్న, శోభన్, లక్ష్మణ్, ఉపేంద్రబాయి, శంకర్, భీముడు, మంగ్యా, శ్రీనివాస్, నెహ్రూ, సుశీలబాయి, జ్యోతిబాయి, త్రివేణి, బహుజన ఉద్యమకారులు షేక్ నజీమా, పి.రాంబాబు, నరేంద్ర, కాపు ఆదినారాయణ, స్పందన, సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ స్వప్నం చేగువేరా



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న అశోక్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ స్వప్నం చేగువేరా అని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యాన ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో చేగువేరా జయంతి సందర్భంగా నివాళులర్పించి మాట్లాడారు. విప్లవ వీరుడు చేగువేర స్ఫూర్తితో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సైదా, శంకర్రావు, శంకర్, మహేష్, గోపి, రాకేష్, ప్రతాప్, పవన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ యువతకు చేగువేరా ఐకాన్ అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్‌కుమార్ అన్నారు. శనివారం చేగువేరా జయంతి సందర్భంగా చేగువేరా వారియర్స్ ఆధ్వర్యాన నగరంలో చేపట్టిన బైక్ ర్యాలీని కేఎంసీ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌తో పాటు పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు నామాల ఆజాద్, చేగువేరా వారియర్స్ నాయకులు సురేష్, గొలుసు వినయ్ మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్,, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు భారత్ సాధిక్, యశ్వంత్, సందీప్, ప్రసాద్, నవీన్, శ్రీ తేజ, నరేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం..

'నగ్నదేశం'కవితా సంపుటి ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: కవి, రచయిత, చిత్రకారుడు సవ్యసాచి రచించిన నగ్నదేశం కవితా సంపుటిని ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ప్రముఖ కవుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యకారులు, కవులు, సాహిత అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 11 కేవీ కవిరాజ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 సెక్షన్ ఏఏఈ జి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి జిల్లా కోర్టు వరకు డ్రెయినేజీ నిర్మాణ పనుల కారణంగా పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లను మారుస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 48వ డివిజన్ మున్నూరు కాపు అధ్యక్షుడిగా శాభాసు వెంకటరమణ, కార్యదర్శిగా ఆకుల సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం సారథినగర్ పరిధిలోని మున్నూరు కాపు సభ్యులను మాజీ కార్పొరేటర్ తోట రామారావు నివాసంలో శనివారం మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ సమక్షంలో ఎన్నుకున్నాక వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాకం శ్యామ్‌బాబు, విప్ప వేణు, వెంకటనరసయ్య, ప్రభాకర్, రాధాకృష్ణ, రవికిషోర్, వెంకటప్పయ్య, వీరాస్వామి, నర్సింహారావు, నాంచారయ్యలు అభినందించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రపంచ రక్తదాన దినోత్సవం, బోస్ యాదవ్ జన్మదిన సందర్భంగా నగరంలోని విదుర బ్లడ్ బ్యాంకులో శనివారం రక్తదాన శిబిరంఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీ ఆర్ విత్ యూ ఆర్గనైజేషన్ ఫౌండర్ పేరం బోస్ యాదవ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యాన ప్రతీ ఏడాది రక్తదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 మంది పైగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విదుర బ్లడ్ బ్యాంక్ బాధ్యులు సైదులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే విజయం సాధ్యం..

ఖమ్మంఅర్బన్: రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ ఐక్యతతో పని చేయాలని, నిబద్ధతతో పనిచేసే వారిని పార్టీలో సముచిత స్థానం కల్పించబడుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు అధ్యక్షతన, పరిశీలకుడు పుచ్చకాయల వీరభద్రం పర్యవేక్షణలో కమతం రామకృష్ణను డివిజన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, మద్దాడపు రవీంద్ర, బోడ ప్రవీణ్, బొమ్మిడి శ్రీనివాస్, అక్తర్ షరీఫ్, బొబ్బిలి గోరిమియా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కామేపల్లి: రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సీపీఎం కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కొత్తలింగాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం వైరా డివిజన్ రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు సహకారం అందించాల్సిన ప్రభుత్వం మాయమాటలు చెబుతూ మోసం చేస్తుందని, అందించాల్సిన పథకాలన్ని నిలిపివేసి సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, ప్రజలకు అందాల్సిన పథకాలు, అభివృద్ధి ఫలాల సాధనే లక్ష్యంగా సీపీఎం ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు రమేశ్, కృష్ణ, నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, నాగభూషణం, బాదావత్ శ్రీనివాస్, సత్యనారాయణ, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే సుపరిపాలన సాధ్యం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూసుమంచి: దేశంలో సుపరిపాలన ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, కిసాన్ మోర్చా కేరళ ఇన్‌చార్జ్ గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పదకొండేళ్ల పరిపాలనను పురస్కరించుకుని శనివారం పాలేరులో కిసాన్‌మోర్చా ఆధ్వర్యాన నిర్వహించిన కిసాన్ సంవాద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటాక మోదీ పాలనపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు సోమగాని ఎల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్ రాథోడ్, నున్నా రవి, కార్యదర్శులు పరికంటి వీరభద్రం, హట్యానాయక్, మండల అధ్యక్షురాలు పుణ్యవతి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీలో ఐక్య పోరాటాల సంఘం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఈనెల 21, 22 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న నేపథ్యాన జయప్రదం చేయాలని సీఐటీయూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఖమ్మంలోని సీహెచ్.వీ.రామయ్య స్మారక భవనం వద్ద మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. గుండు మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఏఐఆర్ టీడబ్ల్యూఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రం, ఖమ్మం డిపో అధ్యక్షుడు గడ్డం వెంకటయ్యలతో పాటు తోకల బాబు, మీరా, వి.రమేష్, బుగ్గవీటి లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి ఆహ్వాన పత్రికలు..



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మందిర ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్ షిర్డీ సాయిబాబా మందిరంలో జూన్ 30 నుంచి జూలై 10 వరకు నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకల ఆహ్వాన పత్రికను శనివారం మందిర కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడగా.. నిర్వహణ కమిటీ ప్రతినిధులు అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్మోహన్‌రావు, ఉమేష్, నూనె శ్రీను, రంగా ఆనంద్, పవన్, తీర్థాల శ్రీను, ఎంసీ గుప్తా, రంగ సీతయ్య, కిరణ్ పూజారి పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ..



ట్రై సైకిల్ అందిస్తున్న మేయర్ నీరజ, క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఖమ్మంలో వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, మున్సిపల్ కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి పెద్దాస్పత్రిలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, జి.శ్రీరామ్, క్లబ్ సీనియర్ ప్రతినిధులు డాక్టర్ రాఘవరెడ్డి, విశ్వేశ్వరరావు, డీపీసీ రావు, వెంకయ్య, అప్పారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలు..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆర్థిక తోడ్పాటుతో శనివారం గట్టయ్యసెంటర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షుడు నరాల నరేష్‌లు మాట్లాడగా.. పాల్వంచ క్రిష్ణ, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు కుట్ర'



మాట్లాడుతున్న గాదె లక్ష్మీనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ ఆరోపించారు. శనివారం ఖమ్మంలో కూలీల అడ్డా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఈనెల 17న హైదరాబాద్ కార్మిక శాఖ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో ఖమ్మం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొడ్డగొర్ల శ్రీను, జిల్లా కోశాధికారి మూలగుండ్ల గోపీనాథ్, జిల్లా నాయకులు శ్రీను, ఈసారపు వెంకటేశ్వర్లు, సాధు నాగరాజు, లక్ష్మయ్య, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



జంక్షన్‌లో జలం..



మంచికంటినగర్ రోడ్డు జంక్షన్‌లో నిలిచిన నీరు

ప్రజలకు సుఖప్రయాణం కలిగేలా నిర్మించిన రోడ్డు నిర్మాణంలో కొద్దిపాటి నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరంలోని 4, 5వ డివిజన్ల సరిహద్దులోని మంచికంటినగర్, బాలాజీనగర్ రోడ్ల కూడలిలో మూడు వైపులా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే నిర్మాణ సమయాన పల్లంగా నిర్మించడంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా జంక్షన్ వద్ద నీరు నిలిచి మురుగుమయంగా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించేవారు మడుగులో అడుగులు వేస్తూ ఈ నీటిని దాటెపోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని నీరునిల్వ లేకుండా చూడాలని నివాసులు కోరుతున్నారు.

- ఖమ్మం అర్బన్